RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , సెప్టెంబర్ 27 , 2026

# ముడి పామాయిల్‌పై సుంకం తగ్గింపు.. రైతుల్లో ఆందోళన

- ఆయిల్‌పామ్ రైతులకు నష్టం వాటిల్లే అవకాశం
- తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ (సీపీఓ) దిగుమతులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆయిల్‌పామ్ రైతుల్లో ఆందోళన నెలకొందని తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. వంటనూనెల ధరలను నియంత్రించి ద్రవ్యోల్బణాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వినియోగదారులకు ఎంతమేర ప్రయోజనం కలిగిస్తుందో స్పష్టత లేకపోయినా, దేశీయ ఆయిల్‌పామ్ రైతులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**దిగుమతులతో దేశీయ ధరలపై ఒత్తిడి**
ముడి పామాయిల్ దిగుమతులు తక్కువ ధరలకు అందుబాటులోకి వస్తే దేశీయ మార్కెట్‌లో పామాయిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని పుల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు రైతుల నుంచి కొనుగోలు చేసే తాజా పండ్ల గెలల (ఎఫ్ఎఫ్‌బీ) ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులు నాలుగైదేళ్లపాటు పెట్టుబడులు పెట్టిన అనంతరం దిగుబడులు పొందుతున్నారని, ధరలు తగ్గితే వారి ఆదాయంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ వంట నూనెల మిషన్--ఆయిల్‌పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) లక్ష్యాలపై కూడా ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

**ఆయిల్‌పామ్ రైతులకు రక్షణ కల్పించాలి**
అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి తదితర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని పుల్లయ్య తెలిపారు. ఇప్పటికే ఓఈఆర్, ధరల నిర్ణయం, చెల్లింపుల విషయంలో రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, తాజాగా దిగుమతి సుంకం తగ్గింపు వారికి మరింత భారంగా మారే అవకాశం ఉందన్నారు. దేశీయ ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఎఫ్ఎఫ్‌బీ ధరలకు రక్షణ కల్పించాలని, ఓఈఆర్ ఆధారిత ధరల విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. దిగుమతి విధానాల వల్ల దేశీయ రైతులకు నష్టం కలగకుండా రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ఎన్ఎంఈఓ-ఓపీ కింద హామీ ధర, కొనుగోలు భద్రతను మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.

# అక్టోబర్ 8కి టీజేఎంయూ మహాసభలు వాయిదా

- రేపు జరగాల్సిన సభల తేదీలో మార్పు
- అనివార్య కారణాలతో నిర్ణయం.. జిల్లా ప్రధాన కార్యదర్శి జి. ఉదయరాఘవేంద్ర



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ (టీజేఎంయూ) అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభల తేదీ మారింది. ఈ నెల 28న నిర్వహించాల్సిన మహాసభలను కొన్ని అనివార్య కారణాల వల్ల అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేసినట్లు టీజేఎంయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. ఉదయరాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యూనియన్ కార్యకలాపాలను మరింత విస్తరించడంతో పాటు జర్నలిస్టుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమ అంశాలపై సమిష్టిగా పనిచేసే లక్ష్యంతో అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సవరించిన తేదీ ప్రకారం అక్టోబర్ 8న ఉదయం 11 గంటలకు అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌస్‌లో మహాసభలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా ముందుకు వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని ఉదయరాఘవేంద్ర పిలుపునిచ్చారు. తేదీ మార్పును గమనించి అక్టోబర్ 8న జరిగే ప్రథమ మహాసభకు జర్నలిస్టు మిత్రులందరూ అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# పట్టణ అభివృద్ధికి కీలక తీర్మానాలు



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు.సమావేశంలో పట్టణ పరిధిలో వీధి కుక్కల నియంత్రణ, నివారణ, చికిత్స కోసం జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు, తాగునీటి సరఫరా కోసం ఏడు మోటార్ల కొనుగోలు, మట్టి వినాయక విగ్రహాలకు ప్రోత్సాహక చెల్లింపులు, మెజర్‌మెంట్ బుక్స్ కొనుగోలు తదితర అంశాలకు ఆమోదం తెలిపారు.
అదేవిధంగా వీధి జంతువులు, కోతుల నియంత్రణ చర్యలు చేపట్టడం, జేసీబీ ద్వారా పారిశుధ్య పనులు నిర్వహించడం, బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనుగోలు, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం, ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటనల బిల్లులను సంబంధిత ప్రచురణ సంస్థలకు చెల్లించడం వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. మున్సిపల్ కార్యాలయ ఇంటర్నెట్ చార్జీల చెల్లింపుతో పాటు అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామ పంచాయతీలు ప్రొఫార్మా-8 ద్వారా చెల్లించాల్సిన బిల్లులు, ఇతర పరిపాలనా అంశాలను కూడా కౌన్సిల్ ఆమోదించింది.
ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుధ్య సేవలు అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తూడి దిలీప్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ వేముల సురేష్, టౌన్ ప్లానింగ్ అధికారి ఏ. వంశీకృష్ణ, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# తల్లాడ ఎంపీడీవో కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**తల్లాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో శ్రీధర్‌రాజు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

తెలంగాణ ముద్దుబిడ్డ వీరనారి ఐలమ్మకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి



**తల్లాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుండేటి వీరారెడ్డి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. నాటి నిజాం పాలనలోని నిరంకుశత్వానికి, దొరల పెత్తందారీ వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి ఐలమ్మ అని కొనియాడారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ, తన కుటుంబం సైతం ఇబ్బందులు పడినప్పటికీ వెనకడుగు వేయకుండా ఆమె పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆమె పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవం, ధైర్యసాహసాలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, మండల కాంగ్రెస్ నాయకులు మారెళ్ల మల్లికార్జునరావు, పగడాల లచ్చిరెడ్డి, కోడూరు రాము, చారి, మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పూరీ జగన్నాథుడి సన్నిధిలో బీఆర్ఎస్ నేతల ప్రత్యేక పూజలు



- కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి నేతృత్వంలో ప్రత్యేక పూజలు
- కేసీఆర్ చిత్రపటంతో పూరీలో సందడి

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
పూరీ శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య సన్నిధిలో అశ్వారావుపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ డాక్టర్ ఉదయ జ్యోతి నేతృత్వంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు జగన్నాథుడిని దర్శించుకుని ప్రత్యేకపూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ తెలంగాణకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ స్వామివారి పాదాల వద్ద మొక్కులు చెల్లించినట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసిపంటలుపండాలనిజగన్నాథుడిని ప్రార్థించినట్లు చెప్పారు.పూరీ ఆలయ గోపురం ఎదుట బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ భక్తితో నమస్కరించిన దృశ్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసాని నాగశేష పద్మ, కాసాని చంద్ర మోహన్, డాక్టర్ భూక్య ప్రసాద్, గుడవర్తి వెంకటేశ్వరరావు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జుజ్జురపు శ్రీరామమూర్తి, పట్టణ మాజీ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, ఆరేపల్లి గోవింద్, మోటూరి మోహన్, కునసోతు నవీన్ తదితరులతో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించి సుభిక్షంగా ఉండాలని జగన్నాథుడిని ప్రార్థించినట్లు వారు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని నిరుపేద దంపతుల వినతి





**తల్లాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తల్లాడ మండలం వెంకట్రాముడు తండాకు చెందిన భూక్య శారద, రవి దంపతులు అధికారులను కోరారు. తమ వివాహం జరిగి 25 ఏళ్లు గడిచినా ఇప్పటివరకు రేకుల షెడ్డులోనే నివాసం ఉంటున్నామని వారు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇంట్లోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అంతేకాకుండా రేకుల షెడ్‌లో ఎలుకలు, కప్పలు, పాములు సంచరి స్తుండటంతో కుటుంబ సభ్యుల భద్రతపై ఆందోళన చెందు తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో తమ సమస్యను నోడల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాము ఎస్టీ లంబాడా సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలమని, ప్రజాపాలనలో తమ పేరు ఎల్-1 జాబితాలో నమోదై ఉందని చెప్పారు. తమకు ఎలాంటి ఆస్తులు లేవని, సొంత ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత కూడా లేదని తెలిపారు. అధికారులు తమ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతను పరిగణనలోకి తీసుకుని తదుపరి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని భూక్య శారద, రవి దంపతులు విజ్ఞప్తి చేశారు.

# సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక

- తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**తల్లాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యం, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. అణగారిన వర్గాలు, పేదల భూమి కోసం, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ తాసిల్దార్ కరుణాకర్ రెడ్డి, ఆర్ ఐ లు, ఆ కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది, సహ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో చేయూత లబ్ధిదారుల ఇళ్ల తనిఖీ

**తల్లాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**



అన్నారుగూడెం గ్రామపంచాయతీని శనివారం ఖమ్మం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీజ ఆకస్మికంగా సందర్శించారు. చేయూత పథకం నూతన లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మహిళా లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి పెన్షన్ అర్హత ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రాజు , వెరిఫికేషన్ ఆఫీసర్ ఎండీ తాజుద్దీన్, చేయూత ఫించన్ నూతన దరఖాస్తుదారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ

- అశ్వారావుపేటలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు.రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం అశ్వారావుపేట పట్టణంలోని రింగ్‌రోడ్డు హైస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంతో పట్టణంలోసందడి నెలకొంది.

**మహనీయుల చరిత్ర భావితరాలకు దిక్సూచి**
విగ్రహావిష్కరణ అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యం, నిబద్ధత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి ఒక వర్గానికే పరిమితం కాదని, ఆత్మగౌరవం కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
పాఠశాల సమీపంలో ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, యువత ఆమె చారిత్రక పోరాటాన్ని తెలుసుకునే అవకాశంకలుగుతుందనిఅన్నారు.మహనీయుల చరిత్రను భావి తరాలకు పరిచయం చేయడం సమాజబాధ్యతఅని పేర్కొన్నారు.

**పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం**
ఐలమ్మ అణచివేతకు ఎదురొడ్డి, అన్యాయాలపై గళమెత్తిన ధీరవనితగా పలువురు వక్తలు కొనియాడారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ మహిళా శక్తిని చాటుతూ ఆమె సాగించిన పోరాటం నేటి మహిళా సాధికారతకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. సామాజిక సమతా సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ నాయకులు బండారు మహేష్, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, నార్లపాటి దివాకర్, కొల్లు రవికిరణ్, ఆకుల శ్రీను, దండబత్తుల రమేష్, బుచ్చిబాబు, శ్రీను, గుమ్మడి శ్రీను, గుమ్మడి అప్పన్న, అప్పలకొండ, తలుపుల సత్యనారాయణ, తలుపుల రమేష్ తదితరులతో పాటు రజక సంఘం నాయకులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , సెప్టెంబర్ 27 , 2026

# కొండా లక్ష్మణ్ బాపూజీకి 'భారతరత్న' ఇవ్వాలి

**- రవీంద్రభారతిలో నేడు 111వ జయంతి వేడుకలు**

**- ఉత్సవ కమిటీ కో-కన్వీనర్‌గా కోట కిషోర్**



**అచ్చంపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి)**
ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని అచ్చంపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడు, జయంతి ఉత్సవ కమిటీ కో-కన్వీనర్ కోట కిషోర్ కోరారు. నేడు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను నిర్వహించనుంది. ఈ వేడుకల ఉత్సవ కమిటీ కో-కన్వీనర్‌గా కోట కిషోర్‌ను నియమించారు. ఈ సందర్భంగా కోట కిషోర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా భారతరత్న పురస్కారం ఇవ్వడం సముచితమని పేర్కొన్నారు. జయంతి వేడుకల కమిటీ కో-కన్వీనర్‌గా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఉత్సవ కమిటీ ఛైర్మన్, పద్మశాలి సహకార కార్పొరేషన్ ఛైర్మన్ గూడూరి శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కన్నుల పండుగగా వసుంధర గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర




**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
వసుంధర షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర శుక్రవారం కన్నుల పండుగగా, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. మాల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు ప్రత్యేక ఏకరూప దుస్తులు ధరించి, ఆకర్షణీయమైన పగిడీలు, రంగురంగుల కండువాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. సంగీతానికి అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగిన శోభాయాత్ర ఆకట్టుకుంది. యువతతో పాటు మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. శోభాయాత్రను తిలకించిన వాహనదారులు, స్థానికులు తమ చరవాణుల్లో దృశ్యాలను చిత్రీకరించారు. భక్తి, ఉత్సాహం, సాంస్కృతిక సందడితో సాగిన వసుంధర గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ప్రశాంతంగా గణేష్ నవరాత్రి మహోత్సవాలు

**- నిర్వాహకులకు కొత్వాల శ్రీనివాస్‌రావు అభినందనలు**

**పాల్వంచ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**



కొత్తగూడెం నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన నిర్వాహకులకు డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌రావు అభినందనలు తెలిపారు. పాత పాల్వంచ టీయూవీ శక్తి యూత్, తూర్పుబజార్ సనాతన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన ముగింపు శోభాయాత్రలో కొత్వాల శ్రీనివాస్‌రావుతో పాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఈ ఏడాది గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ, అసాంఘిక ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తీసుకున్న జాగ్రత్తలు అభినందనీయమన్నారు. ప్రజల సహకారంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడం సంతోషకరమని పేర్కొన్నారు.

# కేంద్రం వైఖరితోనే బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

**సమ్మెకు సంపూర్ణ మద్దతు: సాబీర్ పాషా**




**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
బ్యాంక్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమ్మె అనివార్యమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. శనివారం మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి కొత్తగూడెం ఎస్‌బీఐ శాఖను సందర్శించి ఉద్యోగులతో సమావేశమయ్యారు. వారానికి ఐదు రోజుల పని విధానంపై ఐబీఏ, యూనియన్ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని, ద్వైపాక్షిక ఒప్పందాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

# కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి

**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**



సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం సీహెచ్ వెంకటరమణ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ ఉద్యమంలో ధైర్య సాహసాలతో పోరాడిన ఐలమ్మ భూమి, భుక్తి, హక్కుల కోసం సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జె.గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి.రజాక్, ఎస్వో టు జీఎం ఎం.గోవిందరావు, వివిధ విభాగాల అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన డీఎస్పీ ఆదినారాయణ





**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 :**
అక్టోబర్ 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సు పోస్టర్‌ను కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ శనివారం ఆవిష్కరించారు. ఆర్టీఐ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కనుకుంట్ల కుమార్‌తో పాటు సమాచార హక్కు చట్టం కమిటీ సభ్యులు సందీప్, నాగరాజు, వీరభద్రం,తరుణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలకమన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆర్‌టీఐ చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు మాట్లాడుతు ఆర్‌టీఐ జాతీయ కన్వీనర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆవిర్భావ మహాసభలో సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, చట్టం వినియోగ విధానం, పారదర్శక పాలన తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా నుండి ప్రజా ప్రతినిధులు, ఆర్‌టీఐ కార్యకర్తలు, సామాజికవేత్తలు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అక్టోబర్ 7న జరిగే సదస్సునువిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జీవో 76 ప్రకారం రామవరానికి పట్టాలు ఇవ్వాలి



**- రామవరం ప్రజల దశాబ్దాల సమస్యను పరిష్కరించాలి**

**- ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ దాదా**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
సింగరేణి ప్రాంతమైన రామవరం ప్రజల దశాబ్దాల సొంతింటి సమస్యను పరిష్కరించి, జీవో 76 ప్రకారం స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ఎఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ దాదా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.రామవరంలో నిర్వహించిన ఎఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రామవరం ప్రజలు సొంత ఇంటి స్థలం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సింగరేణి ప్రాంతాలైన పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని స్థలాలకు జీవో 76 ప్రకారం పట్టాలు ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.
ఈ ప్రక్రియలో రామవరాన్ని కూడా చేర్చి ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించినట్లుగానే, రామవరం పేదలకు కూడా సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని అన్నారు. జీవో 76 ప్రకారం ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేసి, పేదల సొంతింటి కలను నెరవేర్చాలని ఫహీమ్ దాదా కోరారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. ఖయ్యూమ్, ఉపాధ్యక్షులు భూపేష్, జావీద్, రసూల్, ఖమల్, కొయ్యడ రవి, బాబా, రామకృష్ణ, విజయ్‌కాంత్, దాసరి శివ, శ్రీకాంత్, బన్ను, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలు విజయవంతం

**- కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు: యెర్రా కామేష్**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
పదకొండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది యెర్రా కామేష్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వివేకానంద స్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలు ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించి గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారన్నారు. పోలీస్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలు అందించిన సహకారం అభినందనీయమన్నారు. గత 37 ఏళ్లుగా సూపర్‌బజార్ వద్ద కొనసాగుతున్న నిమజ్జన వేదిక సంప్రదాయం ఈ ఏడాది కూడా విజయవంతమైందని, వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దారా రమేష్, కోశాధికారి వందనపు శ్రీధర్, కుడిక్యాల సమ్మయ్య, మెరుగు చింటేశ్వర్, నాగుల రవికుమార్, కూసనా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ: డైరెక్టర్ సూర్యనారాయణ

**- సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఘనంగా ఐలమ్మ జయంతి**




**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జీఎం (పర్సనల్--వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ) కే.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత చాకలి ఐలమ్మ చిత్రపటానికి డైరెక్టర్ సూర్యనారాయణతో పాటు యూనియన్ నాయకులు, శాఖాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ ఉద్యమంలో ధైర్యసాహసాలతో పోరాడిన ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. అణచివేత, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. సింగరేణి కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ వ్యాప్తంగా ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమె ధైర్యసాహసాలు, సేవలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో జరిగే అన్యాయాలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం (సీపీ అండ్ పీ) ఏ.మనోహర్, ఏఐటీయూసీ నాయకులు ఎస్.రాము, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎస్.పితాంబరరావు, సీఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, జీఎం (సీహెచ్‌పీ) పి.ఎలీషా, జీఎం (పర్సనల్--ఐఆర్ అండ్ పీఎం) జి.వి.కిరణ్‌కుమార్, జీఎం (పర్సనల్--ఈఈ అండ్ ఆర్‌సీ) ఏజే ఎం.మురళీధరరావు, జీఎం (ఈ అండ్ ఎం--వర్క్‌షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్) కే.శ్రీనివాసులు, జీఎం (బీడీ) బి.రామదాసు, డీజీఎంలు బి.శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# లక్ష్మీదేవిపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా భద్రు నాయక్ బాధ్యతల స్వీకారం

**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆళ్లపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన బాదావత్ భద్రు నాయక్ శనివారం లక్ష్మీదేవిపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయానికి చేరుకున్న ఆయన జాయినింగ్ రిపోర్టును సమర్పించి అధికారికంగా విధుల్లో చేరారు. గతంలో ఆళ్లపల్లి మండలంలో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేశారని స్థానికులు తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారా నికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానికులు ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ తహసీల్దార్ భద్రు నాయక్‌కు మండల కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

# కోతుల సమస్య పరిష్కారమే కార్పొరేషన్ ధ్యేయం : మేయర్ మూడ్ గణేష్



**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న కోతుల సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. శనివారం రామవరం 16వ డివిజన్‌లోని అంబేద్కర్ చౌక్‌లో కోతులను పట్టేందుకు ఏర్పాటు చేసిన బోనులను ఆయన పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాలతో కార్పొరేషన్‌లోని 60 డివిజన్లలో కోతుల సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి పట్టుకునే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కోతుల దాడులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్పొరేటర్లు, ప్రజల విజ్ఞప్తుల మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగిస్తామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, బ్రాంచ్ కార్యదర్శి మద్రి గోపికృష్ణ, సానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, చారి, జవాన్,లక్ష్మణ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం: సాబీర్ పాషా





**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
నాటి సాయుధ పోరాట అమరుల త్యాగాల పునాదులపైనే నేటి స్వేచ్ఛా తెలంగాణ ఆవిష్కృతమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. దొరల, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, నాయకులు నేరెళ్ల రమేష్, బోయిన విజయ్‌కుమార్, ధనరాజ్, అన్నం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు

**చౌటుప్పల్, సెప్టెంబర్ 26(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**



చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల గ్రామంలో శని వారం ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు నిర్వహించడమైనది. "వినీల ఆకాశం -స్వచ్ఛమైన గాలి" అంశం గురించి విద్యార్థులకు వివరించనైనది. ఈ కార్యక్రమం పాల కుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు, గృహస్థులకు భగవద్గీత గ్రంథాలు ఫౌండేషన్ ఛైర్మన్ పాలకుర్ల మురళి గౌడ్ అందజేశారు. ధర్మబద్ధమైన జీవనం వల్ల పర్యావరణమునకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు, సహ చట్టం జిల్లా అధ్యక్షులు దబ్బెటి శేఖర్, సంఘ నాయకులు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , సెప్టెంబర్ 27 , 2026

# రసాయన శాస్త్రంలో ప్రేరణ లూంబాకు పీహెచ్.డీ

పటాన్ చెరు, సెప్టెంబర్ 26, (తెలంగాణ వాణి)



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ప్రేరణ లూంబా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'అమ్మోనియా, ఎసిటిలీన్ కోసం మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్ వర్కు (మీఫ్), కోవలెంట్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్కు (జూఫ్) పదార్థాల సంశ్లేషణ, లక్షణాల పరిశీలన, గది ఉష్ణోగ్రత వద్ద వాయువును గుర్తించే పనితీరు'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

అమ్మోనియా, ఎసిటిలీన్ వంటి ప్రమాదకరమైన వాయువులను సున్నితంగా, ప్రత్యేకంగా గుర్తించడం కోసం, పోరస్ మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్ వర్కులు (ఎంవోఎఫ్ లు), కోవలెంట్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్కులు (సీవోఎఫ్ లు) రూపకల్పన, అభివృద్ధిపై ఆమె డాక్టరల్ పరిశోధన కేంద్రీకృతమై ఉందని తెలియజేశారు. ఈ అధ్యయనం, షిఫ్ బేస్–ఉత్పన్న, మెటల్–డోప్డ్ ఫ్రేమ్ వర్కుల యొక్క అసాధారణమైన సెన్సింగ్ పనితీరు, స్థిరత్వం, ఎంపిక సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. పర్యావరణ పర్యవేక్షణ, పారిశ్రామిక భద్రత, ప్రజారోగ్యంలో వీటికి వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈ పరిశోధనలో, నిర్దిష్ట వాయువులను గుర్తించడం కోసం అ(ంణూా) ఖఅఆ జశీ(ంణూా) మీఫ్ం, బహుళ లోహ కేంద్రాలు కలిగిన అధిక–ఎంట్రోపీ ఎంవోఎఫ్ లు, జింక్–డోప్డ్ సీవోఎఫ్ ల అభివృద్ధి ఉన్నాయన్నారు. అధునాతన డీఎఫ్టీ అధ్యయనాలు ఈ పదార్థాల మెరుగైన సెన్సింగ్ విధానాలను, ఎలక్ట్రానిక్ లక్షణాలను మరింతగా ధృవీకరించాయని వివరించారు.

# పాఠశాలలో టై, బెల్టులు పంపిణీ



ధర్మారం, సెప్టెంబర్ 26(తెలంగాణ వాణి )

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన బెల్టులు,స్థానిక నాయకులు కొయ్యడ రవీందర్ రెండు వేల రూపాయల విరాళంతో అందించిన టై లను గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణీ హరీష్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న వసతులతో పాటు దాతల సహకారంతో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్ ను అందించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి చదువులో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న, ఉపాధ్యాయులు అనుమల్ల శారద, విద్యా వాలంటీర్ నాగెల్లి సౌజన్య, నాయకులు మాందాల హరీష్, కొయ్యడ రవీందర్, పల్లెర్ల అరుంధతి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



ధర్మారం సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి )

మండలం లోని సావనపల్లి గ్రామానికి చెందిన మారం అంజవ్వ ఇటీవల కూలిపనులకు వెళ్లి పిడుగుపాటుతో అకాల మరణం చెందాగా విషయం తెలుసుకున్న యాదవ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు శనివారం శ్రావణపల్లి గ్రామానికి వెళ్లి భారం అంజవ్వ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంజవ్వ కుటుంబానికి యాదవ సంఘం అండగా నిలిచింది. వారి కుటుంబ సభ్యులకు 14500 రూ "ల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు ఓదెల మాజీ జెడ్పిటిసి గంట రాములు, సంఘం జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధినేని రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చామనపల్లి సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు, పెగడ రమేష్, పెరక శ్రీను, ధర్మారం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు సంఘ రంజిత్ యాదవ్, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దార వేణి నరసింహ యాదవ్, సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ సంపత్,

# కరీంనగర్ బస్‌స్టేషన్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



కరీంనగర్, సెప్టెంబర్ 26 (తెలంగాణవాణి)



పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ చిత్రా మిశ్రా, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి: అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 2013లో ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ బస్‌స్టేషన్‌కు అంబేద్కర్ పేరు పెట్టామని, 13 ఏళ్ల తర్వాత అదే ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి: అంబేద్కర్ స్ఫూర్తితో పాటు జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే ఆశయాలను కొనసాగించాలని మంత్రి పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్ జీవితం, ఆలోచనలను అధ్యయనం చేసి విద్య, సంఘటితం కావడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే బస్‌స్టేషన్‌లో విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను ప్రజలకు నిరంతరం గుర్తుచేసే అవకాశం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

# మానకొండూర్ అసెంబ్లీ ఎన్ఎస్యుఐ అధ్యక్షునిగా అయాన్ నియామకం

శంకరపట్నం, సెప్టెంబర్ 26 (తెలంగాణవాణి)



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నం గ్రామానికి చెందిన మహమ్మద్ అయాన్ మానకొండూరు అసెంబ్లీ ఎం ఎస్ యు ఐ అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఎడవల్లి వెంకటస్వామి జిల్లా కమిటీ, అసెంబ్లీ అధ్యక్షుల నియామకాలను చేపట్టారు. కాగా శంకరపట్నం మండలానికి ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షునిగా సేవలందించిన అయాన్ ని మానకొండూరు అసెంబ్లీ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షునిగా నియమిస్తూ శుక్రవారం నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ సందర్భంగా అయాన్ మాట్లాడుతూ మండల స్థాయిలో అందించిన సేవలు గుర్తింపుని ఇచ్చాయని భావిస్తున్నాను. ఎన్ ఎస్ వి ఐ రాష్ట్ర అధ్యక్షులు నా బాధ్యతను మరింత పెంచుతూ అసెంబ్లీ అధ్యక్షునిగా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం అవుతుంది. ఇకమీద అధిష్టానం నాకు అప్పగించిన పదవిది గురుతర బాధ్యతగా భావించి మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో ఎన్ఎస్యుఐ బలోపేతానికి కృషి చేస్తానని, ఈ నియామకానికి సహ కరించిన మానకొం డూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కాం గ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రి పొన్నం ప్రభాకర్, మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు బండారి తిరుపతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# గొర్రెల పెంపకందారుల సహకార సంఘం తొలి మహాసభ





కరీంనగర్, సెప్టెంబర్ 26 (తెలంగాణవాణి ప్రతినిధి)

ఇందిరా భవన్‌లో కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం తొలి మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**కులవృత్తులకు ప్రభుత్వం అండగా...**

కులవృత్తులను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గొర్రెల పెంపకందారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**50 ఏళ్లకే పెన్షన్**

ముదిరాజులు, గీత కార్మికులు, యాదవులు, నాయీ బ్రాహ్మణులు తదితర కులవృత్తిదారులకు 50 ఏళ్ల నుంచే పెన్షన్ అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరుతామని మంత్రి తెలిపారు.

**గొర్రెలకు బీమా**

గొర్రెలు, మేకలు, ఇతర పశువులకు బీమా సౌకర్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పశుపోషకులకు పశువుల బీమా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

**మార్కెటింగ్ సౌకర్యాల కల్పన**

గొర్రెల పెంపకందారులకు మెరుగైన ధరలు లభించేలా హోల్‌సేల్ మార్కెట్లు, నిల్వ, విక్రయ కేంద్రాలు, మార్కెటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పిల్లల విద్యకు ప్రాధాన్యత**

కుటుంబాల భవిష్యత్ అభివృద్ధికి విద్యే ప్రధాన పునాది అని మంత్రి పేర్కొన్నారు. మారుతున్న పోటీ ప్రపంచంలో పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు.

**గొర్రెల పెంపకానికి ప్రభుత్వ భూములు**

రియల్ ఎస్టేట్ విస్తరణతో పశువుల పెంపకానికి స్థలాలు తగ్గుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ ఆధీనంలోని అనువైన భూములను గుర్తించి గొర్రెలు, మేకల పెంపకానికి సంఘాలకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

**పశుసంవర్ధక రంగానికి ప్రాధాన్యత**

వ్యవసాయంతో పాటు పశుపోషణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమని మంత్రి అన్నారు. పశువైద్య సేవలు, వ్యాధి నిరోధక చర్యలు, బీమా, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

**సమస్యల పరిష్కారానికి హామీ**

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## - భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత

జమ్మికుంట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):



తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న--సదానందం అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం జమ్మికుంట కాటన్ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం అణగారిన వర్గాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ధైర్యం, తెగువ, ఆత్మగౌరవాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్.రాజా, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, గౌరవ సభ్యులు శ్రీపతిరెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్‌రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, అర్తిదారుల సంఘం, హమాలీ, దడువాయి సంఘాల ప్రతినిధులు, అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, మార్కెట్ సిబ్బంది, వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలు, దడువాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌ని సన్మానించిన సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు



గుండ్లపల్లి సెప్టెంబర్ 26 ( తెలంగాణ వాణి ప్రతినిధి )

గుండ్లపల్లి డిండి మండలంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డికి సర్పంచుల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైనందుకు అందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు అందరు కలిసి ఘనంగా భారీ సంఖ్యలో పార్టీ లకు అతీథంగా సన్మానం చేయడం జరిగింది.

సర్పంచుల సమస్యలు గురించి పోరాడి ఎవరికీ ఇబ్బంది వచ్చినా తను ముందుండి సమస్యలు పరిష్కారం చేస్తారని సర్పంచులకు గ్రామాలలోని మండలాల్లో గాని అధికారులతో కానీ ఎలాంటి సమస్యలు ఉన్న అందరిని సమన్వయం చేసి సమస్యలు పరిష్కరిస్తానని ఇకపైన జిల్లాలో నైనా రాష్ట్రంలోనైనా సర్పంచులకు ఏలాంటి ఇబ్బందులు కలగా కుండా మన యొక్క సమస్యలను పరిష్కరిస్తారని తెలపడం జరి గినది. సన్మానంలో పాల్గొన్న దిండి మండలంలోని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం అవసరం

## - జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్గొండ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):

నల్గొండ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్క రించుకుని శనివారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్, బుద్ధవనం, పానగల్, చెరువుగట్టు, దేవరకొండ కోట వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు జిల్లాలో ఉన్నాయని తెలిపారు. దేవరకొండ కోటను మినీ గోల్కొండగా అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, రఫీక్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. 300 మందికి పైగా క్రీడాకారులు,







నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పర్యాటకాభిమానులు సుమారు 150అడుగులజాతీయ జెండాతో హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు.

# గణనాథుని పూజలో సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి



సంగారెడ్డి,కంగ్టి, సెప్టెంబర్ 26,( తెలంగాణ వాణి ప్రతినిధి )

కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో శనివారం గణనాథుని పూజా కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో,ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి, హాజరయ్యారు. గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి,గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి మాట్లాడుతూ గణపతి బప్పా మనందరికీ విఘ్నాలు తొలగించి, విజయాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# ఫోన్ అప్పగించిన కాంగ్రెస్ యువ నాయకుడు



శంకరపట్నం, సెప్టెంబర్ 26 (తెలంగాణవాణి)

మానకొండూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ షారుఖ్‌కు శనివారం మండలంలోని గద్దపాకకు చెందిన యువకుడి రూ.30 వేల విలువైన సెల్‌ఫోన్ దొరికింది.వెంటనే దానిని పోలీస్‌స్టేషన్ లో అప్పగించి, ఏఎస్సై సంపత్ సమక్షంలో అసలు యజమానికి సెల్‌ఫోన్‌ను తిరిగి అందజేశారు.ఈ సందర్భంగా షారుఖ్ చూపిన నిజాయితీ, బాధ్యతాయుతమైన వ్యవహారాన్ని పోలీసు సిబ్బంది, మండల ప్రజలు అభినందించారు. మానవత్వం, నిజాయితీ, బాధ్యతే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని పలువురు ప్రశంసించారు.

# అక్టోబర్ 13 నుంచి రిలే నిరాహార దీక్షలు

## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి: వెంట సత్యనారాయణ

రాజాపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేకరి):



తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూజేఎస్‌సీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంట సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ అక్టోబర్ 13 నుంచి హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఆరు నెలలైనా, ఏడాదైనా దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి ఉద్యమకారులు తరలివచ్చి దీక్షలకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# సేవలందించిన ఉప్పల మనీష్‌కు సత్కారం



రాజాపేట సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేకరి)

రాజాపేట మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ఉప్పల మనీష్ ను శనివారం నవరాత్రి ఉత్సవ నిర్వహణ కమిటీ శాలువాతో సత్కారం చేసి అభినందించారు. హైదరాబాద్ బైరమల్ గూడా ప్రాంతంలోని ఓ అపార్ట్మెంట్లో నెలకొల్పిన నవరాత్రి ఉత్సవాల వినాయకుని వద్ద వివిధ పోటీలను చక్కగా నిర్వహించి కార్యక్రమానికి మరింత వన్నె తేవడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో ఉప్పల మనీష్ నిర్వహించిన వివిధ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడం చాలా సంతోషకరమని తెలిపారు.

# మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు





శంకరపట్నం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)

కరీంనగర్ జిల్లా, శంకరపట్నం మండల రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల రజక సంఘం అధ్యక్షుడు తిరుపతి అధ్యక్షత వహించారు. కాగా కార్యక్రమానికి మండల తహసిల్దార్ కే. సురేఖ, ఎంపీడీవో పి. అనితలతో పాటు మండల మాజీ జెడ్పిటిసి, టిపిసిసి మెంబర్ బత్తిని శ్రీనివాస్ హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు నాయకులు మాట్లాడుతూ వీరవరిత చాకలి ఐలమ్మ పోరాట పటిమను కొనియాడుతూ ఐలమ్మ తెగువను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

**చాకలి ఐలమ్మ జయంతి వేదికగా ముచ్చట గొలిపిన రాజకీయ త్రిసేన**

శంకరపట్నం మండల కేంద్రంలో జరిగిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల వేదికను రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలుగా తలపడుతున్న కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పంచుకోవడం జరిగింది. మండల స్థాయిలో రాజకీయ త్రిసేన పార్టీలు కలిసి పంచుకున్న వేదిక చూపరులను ముచ్చట ముచ్చట గొలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ మూడు పార్టీల మధ్యన ప్రముఖ పోరు సాగుతుండగా రాజకీయాలను పక్కనపెట్టి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన వేడుకలో పాలుపంచుకోవడం ఆహ్వానితులకు ముచ్చట గొలిపింది. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి తిరుపతి, మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షులు గోపగోని బసవయ్య, కీసర సంపత్, గాజుల మహేష్, హుజురాబాద్ ఏఎంసి వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గంటా మహిపాల్, మాజీ జెడ్పిటిసిలు పొద్దుటూరి సంజీవరెడ్డి, లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలిగిరెడ్డి సమ్మిరెడ్డి, మండలంలోని మూడు పార్టీల గ్రామాల సర్పంచులు, ముఖ్య నాయకులు కలిసి ఒకే వేదికలో పాలు పంచుకోవడం ఆసక్తికరంగా కనిపించింది.

# జనసేనలో గడల శ్రీనివాసరావుకు కీలక బాధ్యతలు

**- తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియామకం**

**- పార్టీ సంస్థాగత విస్తరణపై ప్రత్యేక దృష్టి.. క్షేత్రస్థాయిలో శ్రేణుల బలోపేతమే లక్ష్యం**





హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)

తెలంగాణలో జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ గడల శ్రీనివాసరావును నియమించింది. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పటిష్టం చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయడంలో ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.

తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, గ్రామాలు-మండలాలు-జిల్లాల వారీగా సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాల్లో గడల శ్రీనివాసరావు ప్రధానంగా వ్యవహరించనున్నారు. పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, స్థానిక స్థాయిలో నాయకత్వాన్ని అభివృద్ధి చేయడంపైనా దృష్టి సారించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**పరిపాలనా అనుభవం.. పార్టీకి ఉపయోగకరం**

డాక్టర్ గడల శ్రీనివాసరావుకు గతంలో ప్రభుత్వ పరిపాలనలో పనిచేసిన అనుభవం ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ పరిధిలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. స్టేట్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసిన అనుభవంతో పాటు వివిధ స్థాయిల్లో అధికారులతో సమన్వయం చేసుకున్న పరిచయం ఆయనకు ఉంది. ఈ పరిపాలనా అనుభవాన్ని పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో వినియోగించుకోవాలని జనసేన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా విస్తృతమైన తెలంగాణ రాష్ట్రంలో పార్టీ నిర్మాణాన్ని వ్యవస్థీకృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ అనుభవం దోహదపడుతుందని వారు చెబుతున్నారు.

**క్షేత్రస్థాయిపై ఫోకస్**

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా గడల శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టడంతో జనసేనలో సంస్థాగత కార్యకలాపాలు మరింత చురుగ్గా మారే అవకాశం ఉంది. పార్టీకి గ్రామస్థాయి నుంచి బలమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ఇప్పటికే ఉన్న శ్రేణులను సమన్వయం చేయడం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన బాధ్యతలుగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో పార్టీ రాజకీయ విస్తరణకు సంస్థాగత బలం కీలకమని భావిస్తున్న జనసేన.. ఈ నియామకంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలకు సమన్వయం తీసుకురావడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచడం, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై కొత్త బాధ్యతలు దృష్టి సారించనున్నాయి.

**కొత్త బాధ్యతలపై ఆసక్తి**

ఇప్పటికే వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉన్న గడల శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి సంస్థాగత బాధ్యతలు అప్పగించడంతో జనసేన శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. ఆయన పరిపాలనా నేపథ్యం, సంస్థాగత వ్యవహారాలపై దృష్టి పార్టీకి ఏ మేరకు ఉపయోగపడుతుందనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో జనసేనను మరింత విస్తరించేందుకు పార్టీ నాయకత్వం చేపడుతున్న సంస్థాగత చర్యల్లో ఈ నియామకం ఒక ముఖ్యమైన అడుగుగా పార్టీ వర్గాలు అభివర్ణిస్తున్నాయి.